క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవ పూజలు


ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లిలో వెలసిన కాశీ విశ్వేశ్వర ఆలయంలో ఏడో వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామికి వేదపండితులు పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, మంత్రోచ్ఛారణ మధ్య ప్రత్యేక వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సారా ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండల పరిధిలోని రాళ్లపల్లి శివారులోని వంకలో ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈదాడిలో 750 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం చేశారు. కొద్ది రోజులుగా సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. దాడులు చేశారు. రాళ్లపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దుర్గాభవానీ ఆలయం


విశేష అలంకరణలో దుర్గాభవానీ అమ్మవారు

ఉరవకొండ: స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఉన్న దుర్గాభవానీ ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. చైత్రమాసం అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, దీక్షాహోమం చేశారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్ వద్ద టెంకాయలు, గుమ్మడికాయలు ఉంచి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


వాహనదారుల రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

కూడేరు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సీఐ రాజు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని అరవకూరు చెరువు వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై సీఐ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని ఆపి డ్రైవర్ లైసెన్స్, వాహనాల ఆర్సీ పరిశీలించారు. హెల్మెట్ ధరించని, రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు


సింహ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆదివారం సింహ వాహనంలో ఊరేగారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉదయం నుంచి స్వామికి పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకు మార్చన, విశేష పుష్పాలంకరణ, మహా మంగళహారతి, అన్నప్రసాద వినియోగం చేశారు. అనంతరం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన సింహ వాహనానికి ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించిన వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆకుపూజ నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం స్వామి వారి స్వర్ణ కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

- నేలవాలిన అన్నదాత బతుకులు
- కోస్తే కష్టం.. ఉంచితే నష్టమన్నట్లు రైతు పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

ప్రకృతి ప్రకోపం.. రైతుకేదీ ధైర్యం


గాలీవానకు నేల వాలిన వరి పంట


బండూరు వద్ద ఆరబోస్తున్న వరి ధాన్యం

ఆశలు 'వరి'స్తాయని ఆరుగాలం కష్టించి సాగు చేసిన అన్నదాతను ప్రతికూల వాతావరణ పరిస్థితులు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. పంట కోత కోసే సమయంలో అకాల వర్షం.. ప్రకృతి ప్రకోపంతో నిలువునా నష్టపోవాల్సి వచ్చింది. మరోవైపు పెట్టుబడి కూడా పెరిగింది. దిగుబడి కూడా దారుణంగా పడిపోయింది. ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు కావాల్సిన వరి ధాన్యం.. 18 నుంచి 20 బస్తాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పంట కోద్దామంటే నేలకూలిపోయి యంత్రాలకు అందడంలేదు. కూలీలతో చేయిద్దామంటే ఖర్చులు రెట్టింపయ్యాయి. కోస్తే కష్టం.. ఉంచితే నష్టమన్నట్లు రైతు పరిస్థితి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

రాయదుర్గం: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని రబీ సీజన్‌లో బోరుబావుల కింద 1,810 హెక్టార్లలో వరి సాగులోకి వచ్చింది. ఇందులో మెజార్టీగా హెచ్ఎల్‌సీ ఆయకట్టు పరిధిలోని కణేకల్లులో 1,273 హెక్టార్లు, బొమ్మనహాళ్‌లో 456 హెక్టార్లలో బీపీటీ, ఎన్ఎల్ఆర్, ఆర్ఎన్ఆర్, 64 రకం, కావేరి, సోనా రకాలు వేశారు. సాగు ఆరంభం నుంచి రైతుకు ఏదో ఓ కష్టం వెంటాడుతోంది. విత్తనాలు, సేద్యం, ఎరువులు, పురుగు మందుల ఖర్చులు పెరిగిపోయాయి. దీనికితోడు పంట చేతికొచ్చిందనుకున్న సమయంలో ఈదురు గాలులతో అపార నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ. 40 వేలు పెట్టుబడి పెడితే రూ.20 వేలు కూడా రాని పరిస్థితి.

యంత్రాలకు పెరిగిన డిమాండ్

రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంటలు కోతకొచ్చాయి. దీంతో వరి యంత్రాలకు డిమాండ్ పెరిగిపోయింది. ఈదురు గాలులు, వడగండ్ల వాన దెబ్బకు పైరు నేలకూలిపోయి యంత్రాలతో నూర్పిడికి కూడా సాధ్యం కావడంలేదు. కూలీలతో కోయిద్దామనుకుంటే ఖర్చులు మరింత పెరిగిపోతున్నాయి. దీంతో చాలా మంది పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఆశ చావక మరికొందరు అధిక ఖర్చులైనా భరిస్తూ కోత పనులు ప్రారంభించారు. దీన్ని అదునుగా తీసుకున్న దళారులు యంత్రాల అద్దెలు ఇష్టారాజ్యంగా పెంచేశారు. దీంతో రైతుకు మరింత భారం పెరిగింది. గతేడాది గంటకు రూ.2,800 చెల్లిస్తే, ప్రస్తుతం రూ.3,100 నుంచి రూ.3,500 వరకు అద్దె ఉంది. నేలవాలిన వరి కోతకోసి ధాన్యం కుప్ప చేసేందుకు ఎకరాకు 2 గంటల సమయం పడుతోంది. వేకువజాము నుంచి వేచి ఉంటేగానీ యంత్రాలు దొరకని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట తడిస్తే వదులుకోవాల్సిందే ..

అకాల వర్షాలు, ఈదురుగాలులతో వరి రైతు పరిస్థితి దినదినగండంగా మారింది. ఓ వైపు కోత యంత్రాలు దొరకడంలేదు. మరోవైపు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. అన్నదాతకు తీరని అన్యాయం జరిగింది. ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గన్నీ సంచుల కొరత..

కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా వరి కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చినా రైతుకు సరిపడే గన్ని సంచులు ఇవ్వలేక పోయింది. దీంతో చాలాచోట్ల ధాన్యం రాసులు దళారుల పాలవుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు బియ్యం రకం క్వింటాకు రూ.2,300, సోనా కైతే రూ.2,320 తో కొనుగోలు చేస్తున్నారు.


యంత్రాలతో కోస్తున్న వరి

కోలుకోలేని దెబ్బ



పదెకరాల్లో వరి సాగుచేస్తే పుట్టెడు ధాన్యం పండని పరిస్థితి కనిపిస్తోంది. పంట కోత కోసే సమయానికి అకాల వర్షాలు, ఈదురు గాలులు వెంటాడడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. తడిచిన ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. బొమ్మనహాళ్ లోనూ వరి కొనుగోలు కేంద్రం త్వరలో ప్రారంభించాలి.

– చిన్న ఎర్రితాత, బండూరు, బొమ్మనహాళ్ మండలం

రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టా



ఎనిమిదెకరాల్లో వరి, రెండెకరాల్లో పత్తి పంట వదిలేశాను. వరికి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు, పత్తికి రూ.35 వేల నుంచి రూ.45 వేలు చొప్పున సుమారు రూ.5 లక్షల వరకు కేవలం పెట్టుబడికి మాత్రమే ఖర్చు చేశా. దుక్కిదున్నడం, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు ఖర్చులు కలిపితే మరింత రెట్టింపు కానుంది. వరి పంట కోతకొచ్చిన సమయంలో వడగండ్ల వాన, ఈదురుగాలులు చుట్టుముట్టడంతో పంట నేలవాలింది. గింజలన్నీ రాలిపోయాయి. పత్తి పంట పూర్తిగా దెబ్బతినింది. దీంతో ఆరుగాలం శ్రమంతా పొలంలోకే వదిలేయాల్సి వచ్చింది. కుప్ప చేద్దామంటే మరో రూ.లక్ష అప్పు చేయాల్సిన పరిస్థితి.

– రామకృష్ణ, గోనేహాళ్, బొమ్మనహాళ్ మండలం

తడిసిన ధాన్యాన్ని కొనాలి



రబీసీజన్‌లో సాగు చేసిన వరి పంటకు తీరని నష్టం వాటిల్లింది. ప్రకృతి విళయతాండవానికి పంట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి. రైతుకు అండగా నిలవాలి. పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేలా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలి. తూతూ మంత్రంగా వ్యవహరించే పద్ధతి వీడాలి. గన్నీ సంచుల కొరత సృష్టించకుండా సకాలంలో రైతుకు చేర్చాలి. దళారులు తెచ్చే ధాన్యానికి ప్రాధాన్యత ఇస్తే సహించేది లేదు. రైతుకు అన్ని విధాలుగా న్యాయం చేయాలి.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

సొల్లాపురంలో ప్రారంభానికి సిద్ధమైన రామాలయం

- నేటి నుంచి మూడ్రోజుల పాటు ప్రత్యేక పూజలు
- 30న సీతారాముల విగ్రహ ప్రతిష్ట, రాములోరి కల్యాణోత్సవం


నూతనంగా నిర్మించిన రామాలయం

కణేకల్లు: మండలంలోని సొల్లాపురంలో రూ.1.5 కోట్లతో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామస్తులు, దాతల సహకారంతో రామాలయాన్ని నిర్మించారు. వేడుకలు భారీగా నిర్వహించేందుకు ఆలయ నిర్మాణ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయంలో మూడ్రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు చేయనున్నారు. సోమవారం సుప్రభాతం, గంగపూజ, గోపూజ చేసి యాగశాల ప్రవేశం చేయనున్నారు. ఆ తర్వాత రక్షా బంధనం, రుత్విక్కరణం, మాతృకాపూజ, కలశరాధన, అభిషేకం, మహామంగళహారతి పూజలు జరగనున్నాయి. సాయంకాలం గణపతి హోమం, దీక్షా హోమం జరుగనుంది. మంగళవారం రోజున ప్రాతఃకాల పూజ, నవగ్రహ వాస్తుహోమాలు చేయనున్నారు. 108 కలశాలతో అభిషేకం, గ్రామోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం వేకువజామున 3 గంటల సమయంలో బ్రాహ్మ ముహూర్తంలో వేదపండితులు యంత్రప్రతిష్ట, సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం ప్రాణప్రతిష్ట చేయనున్నారు.

చిక్కణ్ణేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేయిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన స్వామిని వేడుకున్నారు. రాయదుర్గం నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, ఆయన సోదరుడు వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందులు చిక్కణ్ణేశ్వరస్వామి కల్యాణ మంటపంలో భక్తులకు నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, నాయకులు ప్రకాష్‌చౌదరి, ఆదిసద్గురు చంద్రశేఖర్ రెడ్డి, హళ్లి నాగరాజు, మారెంపల్లి నాగరాజు, కృష్ణారెడ్డి, టీ.శేషారెడ్డి, యండ్రకాయల వన్నూరప్ప, బండి బసవరాజు, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, మురిడి మురళి, కెంగుంట రామిరెడ్డి, నేసే రఘు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


చౌళూరులో ఓబుళయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శెట్టూరు: మండలంలోని కనుకూరు పంచాయితీలోని చౌళూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ ఓబుళయ్య (40) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతగౌడ్, సర్పంచ్ వెంకటేశులు, ఎంపీటీసీ ప్రహ్లాద తదితరులు ఓబుళయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య ఫోన్ ద్వారా ఓబుళయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఓబుళయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దలింగప్ప, కిష్టప్ప, చౌడప్ప హనుమంతరాయుడు, శివ, ధనుంజ, మనోజ్, తుపాకుల, నాగరాజు, తుపాకుల ఓబుళపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని మురడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమరెడ్డి సతీమణి గౌరమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలియగానే వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి గ్రామానికి చేరుకొని గౌరమ్మ మృతదేహానికి పూలమాలు వేసి నివాళుల అర్పించారు. భీమరెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. మెట్టు వెంట చేనేత విభాగం రాష్ట ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివా, మురడి మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డి, నాయకులు మురళీ మోహన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, మహేష్ బాబు, చిదానందరెడ్డి, పురుషోత్తంరెడ్డి, సంజీవరెడ్డి, హనుమంతరెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

రాయదుర్గంలో భారీ వర్షం


జలమయమైన రాయదుర్గంలోని కొలిమి వీధి


రాయదుర్గంలోని 17వ వార్డు దుగ్గిలమ్మ ఆలయానికి వెళ్లే రహదారిపై భారీగా చేరిన నీరు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో ఆదివారం సాయంత్రం అరగంటకుపైగా భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వర్షం 5.45 గంటల వరకు ఏకదాటిగా కురిసింది. ఉదయం నుంచి మండే ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు భారీ వర్షం ఊరటనిచ్చింది. ఉరుములు, మెరుపులు, గాలితోకూడిన వర్షం కురిసింది. మరోవైపు అరగంట పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని కొలిమివీధి, రామస్వామి వీధి, ఈసేవా ఏరియా, మధుటాకీస్ ఏరియా, దుగ్గిలమ్మ గుడి వెళ్లే ఏరియాలో జలమయ్యాయి. కొండపై నుంచి వచ్చిన వర్షపునీటితోపాటు డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రోడ్లపై వర్షపునీరు భారీగా పారింది. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థలో చిన్నపాటి వర్షం వచ్చిన ముంపు కాలనీలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గుమ్మఘట్ట మండలంలో మోస్తరు వర్షం

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడింది. రంగచేడులో కొబ్బరిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. వర్షం పడడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాలేక ప్రజలు ఇబ్బంది పడ్డారు.

కూడేరు: మండలంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంది. వేడిమికి ప్రజలు తాళలేక అవస్థలు పడ్డారు. ఈ సమయంలో వర్షం కురవడంతో కాస్త వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి ఉపశమనం కొంత పొందొచ్చని ప్రజలు అనుకుంటున్నారు.


రంగచేడు సమీపంలో కొబ్బరి చెట్టుకు పిడుగు పడడంతో మంటలు చెలరేగుతున్న దృశ్యం


కూడేరులో కురిసిన వర్షం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉరవకొండ ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసిన 2000-2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక కరిబసవ స్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఉదయం నాటి గురువులను మేళతాళాల మధ్య ఊరేగింపుగా పాఠశాలకు తీసుకొచ్చారు. అనంతరం గురువులకు ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలు అందించారు. ప్రస్తుత పాఠశాల హెచ్ఎం వీరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు నారాయణప్ప, రామకృష్ణ, శ్రీనివాసులు, ఆంజనేయులు, లక్ష్మిదేవి, సురేష్ యాసిన్, బాషా, మస్తాన్‌వలి, తిరుపతయ్య, పాండురంగ, చంద్రశేఖర్, రాజేశ్వరి, శివ రాజేశ్వరీ, సిద్దప్పలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తాం


ఆకుతోట గోపాల్ రెడ్డి


పైఇంటి మంజునాథ

బ్రహ్మసముద్రం : వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయిలోనూ మరింత బలోపేతానికి కృషి చేస్తామని నంజాపురం, వేపులపర్తికి చెందిన ఆకుతోట గోపాల్, పై ఇంటి మంజునాథ తెలిపారు. వీరిని వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శులుగా నియమించారు. ఈసందర్భంగా గోపాల్, మంజునాథ్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేయడానికి అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కమిటీలో అశోక్‌కు చోటు



కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీగా కంబదూరు మండలానికి చెందిన అశోక్ కుమార్‌కు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. అశోక్ మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా తనకు అవకాశం కల్పించినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వశికేరి



ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా విడపనకల్లు మండలం ఆర్.కొట్టాలకు చెందిన కురుబ వశికేరి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో ఈయన శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. కురుబ వశికేరి మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

4న మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ


పోస్టర్లు విడుదల చేస్తున్న మాదిగ ఉద్యోగ సమాఖ్య నేతలు

ఉరవకొండ: అనంతపురంలోని మాసినేని గ్రాండ్ ఫంక్షన్ హాలులో మే 4న మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ జరుగుతుందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. ఈమేరకు ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. ఉద్యోగ సమాఖ్య జిల్లా గౌరవ సలహాదారు సాకే భాస్కర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో వంశీ, రామకృష్ణ, డేవిడ్ సంపత్‌కుమార్, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు


పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

అధ్వానం.. కూడేరు- సింగంపల్లి రోడ్డు


కంకర తేలి గుంతలు పడి అధ్వానంగా ఉన్న సింగంపల్లి రోడ్డు

కూడేరు: కూడేరు నుంచి సింగంపల్లి వెళ్లే రోడ్డు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉంది. దారి పొడవునా గుంతలు పడి ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ఉన్న కంకరతో అదుపుతప్పి కింద పడి గాయపడ్డారు. కూడేరు నుంచి సింగంపల్లికి సుమారు ఆరు కిలో మీటర్ల దూరం ఉంది. పది నిమిషాల్లో వెళ్లాల్సిన సింగంపల్లికి అరగంట పైగా సమయం పడుతోంది.